ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు





ఆదాయం గోల్‌మాల్

- హోర్డింగ్‌ల నుంచి పూర్తి స్థాయిలో దక్కని సొమ్ము
- రూ.8 కోట్లకు అవకాశంఉన్నా రూ.3 కోట్లుకూడా దక్కని వైనం
- ఫలించని కమిషనర్ చేకూరి కీర్తి ప్రయత్నాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో హోర్డింగ్‌ల ఏర్పాటులో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి. అనధికారిక హోర్డింగ్‌లు యథేశ్చగా కొనసాగుతున్నాయి. ప్రతి హోర్డింగ్‌కు జియో ట్యాగింగ్, క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ చేకూరి కీర్తి చెప్పిన మాటలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో కార్పొరేషన్‌కు రావాల్సిన రూ. కోట్ల ఆదాయం సంబంధిత ఏజెన్సీలు, కాంట్రాక్టు సంస్థలు, దిగువ స్థాయి అధికారులు, బడా రాజకీయ నాయకుల జేబుల్లోకి పోతోంది. ఈ వ్యవహారంపై కమిషనర్ చేకూరి కీర్తి గత ఎమిమిది నెలలుగా ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోయారు. గతకొన్ని ఏళ్లుగా హోర్డింగ్‌ల ఏర్పాటుదారుల నుంచి వసూలు చేస్తున్న సొమ్ము పూర్తి స్థాయిలో కార్పొరేషన్ ఖజానాకు జమ కావడంలేదన్న విమర్శలు వున్నాయి. గతంలో గుంటూరు కమిషనర్‌గా పనిచేసిన శ్రీకేష్ లత్కర్ హోర్డింగ్‌ల ద్వారా కార్పొరేషన్‌కు రూ.8 నుంచి రూ.10 కోట్ల ఆదాయం రాబట్టవచ్చునని అంచనా వేశారు. అయితే గత ఐదేళ్లకాలంలో ఎప్పుడూ రూ.2 కోట్లకు నుంచి మూడు కోట్లకు మించి ఆదాయం రాబట్టలేకపోయారు. ప్రధానంగా నగరంలో అధికారికంగా 1400 హోర్డింగ్‌లు ఉండగా వేలాది హోర్డింగ్‌లు అనధికారికంగా కొనసాగుతున్నాయి. నిబంధనల ప్రకారం అన్ని హోర్డింగ్‌లకు రుసుము వసూలు చేస్తే ఇప్పటికప్పుడే కనీసం రూ.ఐదారు కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా ఏడాదికి రూ. 2కోట్లుకు మించి వసూలు చేయలేకపోయారు. గత కొంత కాలంగా హోర్డింగ్‌ల ఏర్పాటులో నాలుగు బడా సంస్థలే మొత్తం వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని కార్పొరేషన్‌కు ఆదాయం రాకుండా చేస్తున్నాయని అధికార పార్టీ కార్పొరేటర్లే ఇటీవల జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆరోపించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే కూడలి ప్రాంతాల్లో 30 జంబో హోర్డింగ్స్ ఏర్పాటు చేసి సంబంధిత కంపెనీలు భారీగా పొందుతున్నాయి. కార్పొరేషన్‌కు మాత్రం అరకొర ఆదాయం చూపిస్తున్నారు. కూడలి ప్రదేశాల్లో జంబో హోర్డింగ్స్ ఉండకూడదని నిబంధనలు ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గాలి దుమారాలు వచ్చిన సందర్భంగా అవి విరిగి ప్రజలపై పడితే ఎంత మందికి ముప్పు ఏర్పడుతుందని గతంలోనే డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించినా అధికారులు పట్టించుకోలేదు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పాతుకుపోయిన అవినీతి, గుంటూరులోనే ఎక్కువ కాలం పనిచేసిన అధికారులు హోర్డింగ్‌ల నిర్వహాకులతో ఏర్పాటు చేసుకున్న 'అవగాహన' వల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పని చేసిన అధికారులు ఇప్పటికీ టౌన్ ప్లానింగ్‌లో కీలక భూమిక పోషిస్తుండటంతో కార్పొరేషన్‌కు ఆదాయం పెరగకపోగా అడ్డదారులను వెతుక్కోవడానికి అవకాశం లభిస్తోంది.





అగ్రిస్టాల్ పరిశీలిస్తున్న మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తదితరులు

రైతే తొలి శాస్త్రవేత్త : మంత్రి కాకాని

లాంలో అగ్రిటెక్ ప్రదర్శన, సదస్సు ప్రారంభం ▶ 5లో

గడ్డి మందు తాగిన రైతు మృతి



ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన రైతు చెలికాని విజయ్ శంకర్ (42) అర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతు పరిస్థితి విషమించి శనివారం కన్నుమూశాడు. ఫిరంగిపురం ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన రైతు విజయ్ శంకర్ సొంతంగా 3.75 ఎకరాలు, 9 ఎకరాలు ఒకరి దగ్గర, ఎకరం మెట్ట భూమి మరొకరి దగ్గర కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు వేశాడు. పంటల్లో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, రూ.18లక్షలు అప్పులు తేలాయన్నారు. చేసిన అప్పులు తీరే దారి కనబడక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో అప్పుల వాళ్ల తాకిడి కూడా ఎక్కువ కావడంతో శుక్రవారం నుదురుపాడులో కౌలుకు తీసుకున్న పొలం దగ్గర గడ్డి మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు చికిత్స నిమిత్తం మణిపాల్ ఆసుపత్రిలో చేర్చారు. శనివారం రైతు మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, బిటెక్ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డ్రాగన్‌సాగు బహుబాగు

వాణిజ్య పంటగా డ్రాగన్ ఫ్రూట్ పంట

తక్కువ నీరు, తక్కువ ఎరువులు

దీర్ఘకాలిక దిగుబడులతో లాభసాటిగా ఉందంటున్న రైతులు ▶ 4లో



వైకల్యం విజయానికి అడ్డంకి కాదు

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో వక్తలు ▶ 2లో



గుంటూరులో ఉపకరణాలు అందచేసిన కె.వి.శ్రీనివాసులురెడ్డి, ఇతర అధికారులు

అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగం అస్తవ్యస్తం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక బాపూజీ పాఠశాలలో మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం ఎ రఘునాథ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం 3,4,5 తరగతుల విలీనం ద్వారా ఏం సాధించిందని ప్రశ్నించారు. విలీనం నిర్ణయం విద్యార్థుల తల్లీ దండ్రులను ఆవేదనకు గురి చేసిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యారంగ సంస్కరణల కోసం ప్రొఫెసర్‌లు, అధికారులతో నియమించిన కమిటీ వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కమిటీలో ఉన్న ప్రొఫెసర్‌లు పక్కకు పోగా చివరకు సిఎం జగన్ మోహన్ రెడ్డి, అధికారులు మాత్రమే ఆ కమిటీలో మిగిలారన్నారు. పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న ఫార్మెటీవ్ -2 పరీక్షల విధానం గందరగోళంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఫిబ్రవరి 3 న జరిగిన మహత్తర పోరుకు ఉపాధ్యాయులే కారణమని ప్రభుత్వం భావిస్తూ ఉపాధ్యాయుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా ప్రభుత్వం 292 హైస్కూళ్ళలో ప్లస్ - 2 పెట్టిందని, 150 స్కూళ్ళలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదన్నారు. తగినంత మంది ఉపాధ్యాయులను నియమించక పోవడం, ప్రచారం లేక పోవడం తదితర కారణాల వల్ల విద్యాశాఖ వైఫల్యం చెందిందని చెప్పారు. 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం డిఎస్ఇ ద్వారా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం వెంటనే ప్రమోషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, జిపిఎస్‌ను అంగీకరించబోమని స్పష్టం చేశారు. రాజస్తాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశాయని, పంజాబ్ ప్రభుత్వం సిపిఎస్ రద్దుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని చెప్పారు. సిపిఎస్ రద్దు రాజకీయ నినాదం కావాలన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయంకు ఎవరైనా తలవంచాల్సిందే నని, లేనిపక్షంలో ఎంతటి వారైనా, నియంతలైనా కాలగర్భంలో కలసి పోవాల్సిందేనని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలు, జన గణన విధులు నుంచి ఉపాధ్యాయులను ప్రభుత్వం 2లో



తుళ్లూరులో యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీకెఎస్ లక్ష్మణరావు

విఫల ప్రయోగాలు ఫలితాలు ఇవ్వవు

పల్నాడు జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు నిర్వహిస్తున్న నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు (ఎఫ్.ఏ) నిర్వహణలో విద్యా శాఖ చేస్తున్న ప్రయోగాలు విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేవని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి ప్రేమ్ కుమార్, జి.విజయసారథి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెలలో నిర్వహించిన నిర్మాణాత్మక మూల్యాంకనం1 (ఎఫ్.ఏ1) ఒఎంఆర్ షీట్ల ద్వారా జవాబులు రాశారని ఇది ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అత్యంత కష్టంగా ఉంటుందన్నారు. నిర్మాణాత్మక మూల్యాంకనం 2 కి వచ్చేసరికి ఎస్.డి ఈ.ఆర్.టి సిబ్బంది ప్రశ్నాపత్రాలు పంపడం వారు ప్రధానోపాధ్యాయులకు పంపడం, ఉపాధ్యాయులు వాటిని తరగతి గదిలో బోర్డుపై రాయటం ఆ ప్రశ్న పత్రాన్ని విద్యార్థులు చూసి రాసుకొని జవాబులు రాయటం అత్యంత క్లిష్టంగా మారిందని మూల్యాంకనం ఉపయోగకరంగా లేదన్నారు. గతంలో డి.సి.ఈ.బి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సమర్థవంతంగా పత్రాలను సీనియర్ ఉపాధ్యాయుల రూపొందింప చేసి ముద్రించి పాఠశాలకు ముందుగానే పంపడం జరిగేదని అదే విధానం కొనసాగించాలని కోరారు. మూడు రోజులపాటు జరిగే ఎఫ్.ఏ పరీక్షలు నిర్వహణ ఒక్క ఉపాధ్యాయునికి మరింత ఇబ్బందికరంగా ఉంటుందని విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఈ పరీక్షలు నిర్వహణ విఫల ప్రయోగమని ఇప్పటికే యుటిఎఫ్ ఉన్నతాధికారుల దష్టికి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రకటన జారీ చేసిన వారిలో జిల్లా గౌరవ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు ఎన్. సుందర్ రావు, ఏ.భాగ్య శ్రీదేవి, కోశాధికారి జె.వాల్యా నాయక్ తదితరులు ఉన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగం అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

తుడుపు చర్యని, మొత్తం బోధనేతర కార్యక్రమాలను నుంచి దూరంగా ఉంచాలని అన్నారు. జీతాలు 5,6 తేదీల్లో చెల్లించకపోతే డిఇఒ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి ఆదిలక్ష్మి, సహ అధ్యక్షులు ఎ ఎల్ లక్ష్మి పార్వతి, జిల్లా కార్యదర్శి సి హెచ్ ఆది నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ తుళ్లూరు మండల కమిటీ

నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎ రఘునాథ్,టి భాస్కరరావు ఎన్నికయ్యారు.తొలుత సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు కె రాజయ్య యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూటీఎఫ్ అధ్యక్ష,కార్యదర్శి గా పనిచేసిన నాగటి నారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.



చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న క్లబ్ సభ్యులు

మున్సిపల్ చైర్మన్‌కు లైన్స్ క్లబ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పురపాలక సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బోయ రఘురాం రెడ్డికి లైన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు విడేలా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ మండలి సలహా కమిటీ చైర్మన్ రెడ్డి, లైన్స్ నేతలు చుండూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

వైకల్యం విజయానికి అడ్డంకి కాదు

- **ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి**
- **అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో వక్తలు**

ప్రజాశక్తి-గుంటూరు

వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ అందరికీ స్ఫూర్తినిస్తున్న వికలాంగులకు అందరూ చేయూతనివ్వాలని, గౌరవించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవద్ధుల సంక్షేమ శాఖ నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. మద్దాలి గిరిధరరావు మాట్లాడుతూ వైకల్యం వైఫల్యం కాదని వారికి ఆత్మస్థైర్యం ఇవ్వాలన్నారు. మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ సమాజం వారికి అండగా నిలబడాలన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఆటలు పోటీలలో విజేతలకు ప్రైజులు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముందుగా వికలాంగులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ. 5వేలకు పెంచాలని, వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్నా, కుటుంబ రేషన్ కార్డులో పేరు ఉంటే మిగిలిన వారికి కూడా పెన్షన్ నిలుపుదల చేస్తున్నారని, అలా పెన్షన్ తీయకుండా చూడాలని, మున్సిపాలిటీలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని భవితా సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష రాష్ట్ర అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. డిఇఒ పి.శైలజ మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లలకు కావాల్సిన ఉచిత ఉపకరణాలు పంపిణీ చేశారు.

వినుకొండ : మండలం లోని పెదకంచెర్ల గ్రామంలో వికలాంగుల దినోత్సవం సందర్భంగా చిమట లీలావతి మాన్ విజ్ఞాన వికాస్ కేంద్రం కమిట్మెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ మరియు వివిధ సాంస్కతి కార్యక్రమాలు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ మరియు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఏ తౌషిద్ హుస్సేన్ మరియు న్యాయవాదులు బందం విఠం రాజుపాలెం గ్రామం వద్ద గల సెయింట్ ఆన్స్ ఉషోదయ ప్రత్యేక పాఠశాల లో చెవిటి మరియు మూగ మానసిక వికలాంగుల విద్యార్థులకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. **తెనాలి :** దివ్యాంగులలో కొన్ని ప్రత్యేకతలు, సకలాంగులను మించిన తెలివితేటలు ఉంటాయని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలాజీ రావు పేట భవిత సెంటర్ నందు హ్యాపీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పాల్గొని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. హ్యాపీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ వి. పవని ప్రియాంక బాలబాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. స్థానిక యడ్ల లింగయ్యకాలనీలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. **ముప్పాళ్ల :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో గల భవిత సెంటర్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో పుట్టారెడ్డి, ఎంఇవో ఒంగోలు రాజు,పాఠశాల హెచ్ఎమ్ పార్వతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. **తాడికొండ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత విద్యా కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఇఒ తెనాలి ఇందిరా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **పెదనందిపాడు:** దివ్యాంగుల పట్ల సానుభూతి చూపటం కాదని, వారిలోని అంతర్గత సామర్థ్యాన్ని వెలికి తీయడానికి తగిన సహకారం అందించాలని కాకుమాను మండల విద్యాశాఖ అధికారి కె ఎఫ్ కెనడీ పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా ఈరోజు కాకుమాను మండల కేంద్రం భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు.



గుంటూరులో దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న ఎమ్మెల్యేలు, అధికారులు



తెనాలిలో వైద్యశిబిరంలో డాక్టర్ పావని ప్రియాంక, సబ్ కలెక్టర్



ముప్పాళ్ల



వినుకొండ

'టిడిపి' ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన వార్డులో ఇంటింటికీ తిరిగారు. వైసిపి పాలనలో పేదల పరిస్థితి మరింత దిగజారిందన్నారు. సంక్షేమం పేరిట ఊదర గొట్టే ప్రభుత్వం అర్హులకు ఆ పథకాలు దక్కనివ్వటంలేదని విమర్శించారు. నిత్యావసరాల ధరలు గణనీయంగా పెంచి, పన్నుల భారం మోపిందన్నారు. ప్రశ్నించిన వారిని కేసుల్లో ఇరికించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వైసిపి పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో టి.హరిప్రసాద్, రావి చిన్ని, పరుచూరి రమ్య తదితరులు పాల్గొన్నారు. **కొల్లిపర :** మండలంలోని హనుమాన్ పాలెం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి.. కార్యక్రమం ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలోనిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పేద ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకుని ప్రభుత్వ వైఫల్యాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భీమవరం చిన్న కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ జోగేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, కంచర్ల అమృత రాజు, కొల్లి శివరామిరెడ్డి, బొంతు చంద్రిక, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పెదకూరపాడు: మండలంలోని తమ్మవరం గ్రామంలో శనివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజధాని సమస్య, ఇసుక అందుబాటులో లేకపోవడం, ఉన్నా అధిక ధరకు లభించటం, గ్రామానికి రహదారి లేదని తెలిపారు. కొంతమంది పెన్షన్లు, ఇళ్ల స్థలాలు రాలేదని తెలియజేశారు. ఆయన వెంట మండల, గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో ప్రజలతో ఆలపాటి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని వడ్డమానులో ధాన్యం కొనుగోలు కేంద్రంను నెక్కల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం మాజీ అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె. శ్రీరంజని మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. వడ్డమాను క్లస్టర్ కింద వడ్డమాను, హరిశంద్రపురం గ్రామాల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. 100కేజి ల గ్రేడ్ - ఎ రకం ధాన్యం రూ 2060లు,75 కె జిలు రూ 1545లు,సాధారణ రకం 100 కేజీ ల ధాన్యం రూ2040లు,75 కేజీ లు రూ1530లు కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.తేమ శాతం 17శాతం కి లోపు ఉండాలన్నారు.కార్యక్రమంలో వీఎఎ సాయి సుందర్,రైతులు పాల్గొన్నారు.

ధాన్యంకొనుగోలు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్తిపాడు మండలం వంగిపురం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జి. లక్ష్మి, జిడిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరి గోపాల్ శనివారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి నలుగురు రైతుల వద్ద నుండి గ్రేడ్ ఏ రకాన్ని 158 క్వింటాళ్లు ధాన్యం క్వింటాలుకు రూ. 2060 చొప్పున కొనుగోలు చేసి పత్రాలను రైతులకు అధికారులు అందచేశారు.



వంగిపురం రైతు భరోసా కేంద్రం పత్రాలు అందజేస్తున్న అధికారులు



వడ్డమానులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అధికారులు

గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-వినుకొండ



స్థానిక శ్రీనివాస్ నర్సింగ్ హోమ్ సమీపంలోని అమెజాన్ డెలివరీ షాప్ ఎదురుగా గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు వినుకొండ పట్టణ సిఐ అశోక్ బాబు శనివారం తెలిపారు. మృతుని వయస్సు 35 నుండి 45 సంవత్సరాలు ఉండవచ్చని, తెల్ల చొక్కా, బనియన్, నావి బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు వివరించారు. మృతదేహం ఆచూకీ తెలిసినవారు 9440796248, 08646 272333 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలను సహించం

ప్రజాశక్తి -తెనాలి రూరల్



ప్రజలకు అసౌకర్యం కలిగించే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు చెప్పారు. రూరల్ గ్రామం అంగల కుదురులో జనా వాసాల మధ్య మద్యం సేవిస్తు న్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా బహిరంగ ప్రదేశంలో, జనావాసాల మధ్య బహిరంగంగా మద్యం సేవించినా, అల్లర్లకు పాల్పడినా వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో బోల్తా.. డ్రైవరు మృతి

ప్రజాశక్తి- మేడికొండూరు

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని డోకిపర్రు శాంతినగర్ కాలనీలో శనివారం జరిగింది. తాడేపల్లి సమీపంలోని ఉండవల్లికి చెందిన వేములూరి కోటయ్య స్వామి ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. డోకిపర్రు శాంతినగర్‌లో తన తల్లి వేముల లక్ష్మమ్మను చూసేందుకు ఉండవల్లి నుండి ఆటోలో వచ్చాడు. ఇంటికి చేరే క్రమంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది.

ఈ ప్రమాద ఘటనలో ఆటో డ్రైవర్ వేముల కోటయ్య స్వామి(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యాపిల్లలు ఉన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కోటయ్య స్వామి

అనధికార విక్రయానికి తరలిస్తున్న విత్తనాలు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అనధికార విక్రయానికి తరలించేందుకు సిద్ధం చేసిన విత్తనాలను వ్యవసాయాధికారులు స్వాదీనం చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ వెల్లడించిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారంతో ఏడిఏ కె.వెంకటేశ్వర్లు తనిఖీలు నిర్వహించారనన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని నవత ట్రాన్స్‌పోర్టులో కర్నూల్ నుంచి తెచ్చిన ఇండియన్ సీడ్స్‌కు చెందిన జొన్న విత్తనాలను స్వాదీనం చేసుకున్నారు. మహికో కంపెనీకు చెందిన హైబ్రిడ్‌జొన్న విత్తనాలు 450 కేజీలు, దాదాపు రూ.1.47లక్షల విలువ ఉంటుందన్నారు. కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన యర్రు శ్రీనివాసరావుకు చెందినవిగా గుర్తించారు. జేసి కోర్టులో కేసు నమోదు చేసి, విత్తనాలు సీజ్ చేశారు. దాడుల్లో ఏడిఏతో పాటు ఏఈవో మోహన్ సిబ్బంది ఉన్నారు.



ట్రాన్స్‌పోర్టులో స్వాధీనం చేసుకున్న విత్తనాలు

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-నాదెండ్ల



ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొట్టుకున్న సంఘటన మండలం లోని సాతులూరు, చందవరం గ్రామాల మధ్య స్టీమ్ రైస్ మిల్లు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బి.టెక్ చదువుతున్న విద్యారి, సిమెంటు పని చేసే యువకుడికి తీవ్రగాయా లయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం చందవరం గ్రామానికి చెందిన విద్యార్థి వంక విష్ణు సాతులూరు నుండి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే గ్రామానికి చెందిన, సిమెంట్ పని చేసే ఏడుకొండలు చందవరం నుండి సాతులూరు వైపు వెళుతున్నాడు. రైస్ మిల్లు వద్ద రోడ్డుపై లారీలు పార్కింగ్ చేయటంతో అడ్డుగా ఉన్న లారీలు తప్పించబోయిన ఇద్దరి వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నారు. తీవ్ర గాయాలపాలైన వీరిద్దరిని ఆటోలో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. లారీలు అడ్డుగా ఉండటంతోనే ప్రమాదాలు చోటుచేసు కున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. వాహనాలను మిల్లులో పార్కింగ్ చేయాలి గానీ రోడ్డుపై ఉంచడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఆస్తి తగాదాల ఘర్షణ,ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి-ఈపూరు

ఆస్తి తగాదాల విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువురు గాయపడిన సంఘటన మండలంలో ని అగ్నిగుండాల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంటా రామయ్య, పాలినీడి లక్ష్మయ్య లకు ఆస్తి తగాదాల నేపథ్యంలో ఘర్షణ పడడంతో గంటా రామయ్య, పాలినీడి లక్ష్మయ్య లు గాయపడగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై విప్పర్ల వెంకటరావు తెలిపారు.

రైతులకు మేలు చేయాలి: మాజీ ఎమ్మెల్యే మక్కెన

ప్రజాశక్తి- వినుకొండ

వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కుమిరిశెట్టి రామారావు, డైరెక్టర్లను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అభినందించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యా లయంలో శనివారం ఉదయం కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారికంగా కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ ఏర్పడడం సంతోషకరమని, యార్డు పరిధిలోని రైతులకు మంచి సేవలు అందించాలని కోరారు. రైతు ప్రభుత్వం సాగుతుందని ఎమ్మెల్యే గొల్ల బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో రైతులను ఆదుకోని వ్యవసాయ మార్కెట్ ను అభివద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలిరెడ్డి, గోరంట్ల ఆంజనేయులు, తలారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 6,500 ఓట్లు తొలగించారు మాజీ ఎమ్మెల్యే యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ పేరుతో తెలుగుదేశం పార్టీకి చెందిన 6,500 ఓట్లు తొల గించారని గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడూతు నియోజకవర్గంలో వైసిపి నాయకులు అభివృద్ధి మరిచి హత్యలు చేస్తున్నారని, మాహిళలపై హత్యచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన చిన్నారికి లివర్ సంబంధిత సమస్య వస్తే నాటి ముఖ్యమంత్రికి చెప్పి 18 లక్షల రూపాయిలు అందించామని, నేడు వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సహాయం చేయకోపోగా వీరి ధన దాహానికి 8 మంది చిన్నారులను బలి తీసుకున్నారని మండిపడ్డారు. 'మేము సాయం చేశాం.. మీరు ఉసురు తీసుకుంటున్నారు' అని విమర్శించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 9 హత్యలు చేశారని, ఎన్నో కుటంబాలు వీరి వల్ల సొంత గ్రామాలను వదిలి వెళ్ళి పోయారని, ఫ్యాక్షన్ గొడవలతో నియోజకవర్గాన్ని నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ప్రభుత్వ అధికారులు కూడ వారికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని అధికారులు గుర్తుపెట్టు కోవాలని, 'మా ప్రభుత్వం వస్తే మీ పని పడతాం' అని ఆయన హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తురకా వీరస్వామి,పట్టణ అధ్యక్షులు గొంట్ల శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు అమీర్‌అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోడెల శివరామ్ పరామర్శ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

అనారోగ్యంతో బాధపడుతున్న చాగంటివారిపాలెం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు కళ్ళం సత్యనారాయణరెడ్డిని టిడిపి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కోడెల శివరాం శనివారం పరామర్శించారు. సత్యనారాయణ రెడ్డి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, వైద్యానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి తగు సలహాలు సూచనలు చేశారు. మందుల ఖర్చు నిమిత్తం ఆయనకు రూ.5 వేలు అందజేశారు. అనంతరం శివరామ్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. శివరామ్ వెంట తెలుగు యువత మండల నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కరాటే శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ మౌలాలి, పూజల రామలింగయ్య, తోలుసూరి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

'భవిత'కు ప్రభుత్వం భరోసా

ప్రజాశక్తి-ఈపూరు

భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సంబంధిత పరి కరాలను అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని జడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులైన పిల్లలకు 2 వీల్ చైర్లు,1 ట్రై సైకిల్, 1 రొలేటర్‌ను ఎంపిపి ఈదర రాధిక అందజేశారు. ఎంపిడిఒ ఎ.ఉషాకిరణ్,ఎంఈఓ కెపి బాబురెడ్డి, ఐఈడి కోఆర్డినేటర్లు నిర్మలకుమారి,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో టిడిపి 'ఇదేమి కర్మ'

ప్రజాశక్తి-నరసరావుపేట

వైసిపి అరాచక పాలన అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం, తిరుగుబాటు రావాలని టిడిపి నియోజకవర్గ బాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము అన్నారు. స్థానిక 7 వ వార్డు ఇస్లాం పేటలో టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నట్టేట ముంచాడని దుయ్యబట్టారు. నల్లపాటి రాముతో కలిసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు.



వ్యవసాయ సదస్సుకు తరలిన రైతులు

ప్రారంభించిన డీఏవో మురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు లాంఫారంలో జరిగే వ్యవసాయ సదస్సుకు జిల్లా నుంచి రైతులు శనివారం జిల్లా వ్యవసాయ కార్యాలయం వద్ద నుండి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఏఓ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు రైతు సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయ పరి కరాల ప్రదర్శన కూడా జరిపి రైతుల్లో అవగాహన పెంపొందిస్తారని వివరించారు. శిక్షణ కార్య క్రమానికి కార్యాలయం నుండి అధికారిగా శివకుమారి, నరసరావుపేట సబ్ డివిజన్ సహాయ వ్యవ సాయ అధికారి పి.మస్తానమ్మ, రొంపిచర్ల ఏవో విజయభాస్కర్, జిల్లా డీఏవో కార్యాలయం నుండి ధనలక్ష్మి వ్యవహరిస్తారని తెలిపారు. 3వ తేదీన నరసరావుపేట రొంపిచర్ల చిలకలూరిపేట నాదెండ్ల ,సత్తెనపల్లి,పెదకూరపాడు,ముప్పాళ్ళ మండలాల నుండి 200 మంది అభ్యుదయ రైతులు పాల్గొం టారని వివరించారు. 4న అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం మండలాల నుండి రెండు వందల మంది రైతులు పాల్గొంటారని, 5న యడ్లపాడు,వినుకొండ,పిడుగురాళ్ల, మాచర్ల సబ్ డివిజన్ నుండి రెండు వందల మంది అభ్యుదయ రైతులు సదస్సుకు హాజరు కానున్నట్లు వివరించారు.

వ్యకాస జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి



ఈ నెల 7, 8, 9 తేదీ లలో జంగారెడ్డి గూడెంలో జరగ నున్న ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ జెండా ఆవిష్కరణ, వాల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. అమరావతి మండల కేం ద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు నండూరి వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు రైతాంగ స మస్యలు, ఉపాధి కూలీలు వేతనాల కోసం వ్యకాస నిరంతరం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో బి.సూరిబాబు, ఎం.సుబ్రహ్మ ణ్యం, సయ్యద్. మొహిదీన్‌వలి, షేక్ నాగుల మీర,షేక్ రఫి పాల్గొన్నారు.

ఎఎన్‌యు హాకీ జట్టుకు 'ధనలక్ష్మి' విద్యార్థి

ప్రజాశక్తి-ఈపూరు



బోయ శివ

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఈ నెల 1వ తేదిన వ్యాయా మ కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల పురు షుల హాకీ పోటీలలో ఎ ముప్పాళ్ళకు చెందిన ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి బోయ శివ ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం జట్టు కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు తెలిపారు. ఈ నెల 11న బెంగుళూరు యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల పోటీల్లో శివ పాల్గొంటాడని, విశ్వ విద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని చెప్పారు. ఈ సం దర్భంగా శివను కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ ఎం.రామ శేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఎం సురేష్ కుమార్,ఆర్. బలరాం నాయక్, ఎం.దాసు అభినందించారు.

డ్రాగన్ సాగు బహుబాగు



- వాణిజ్య పంటగా డ్రాగన్ ఫ్రూట్ పంట
- తక్కువ నీరు, తక్కువ ఎరువులు
- దీర్ఘకాలిక దిగుబడులతో లాభసాటిగా ఉందంటున్న రైతులు



ప్రజాశక్తి - నరసరావుపేట

మార్కెట్ లో మంచి గిరాకీతో పాటు దీర్ఘకాలిక దిగుబడినిస్తూ, నీటి ఎద్దడిని తట్టుకుంటూ, తెగుళ్ళు చీడ పీడల బెడద లేని పంటలవైపు రైతులు మొగ్గుచూపు తున్నారు. బోరు బావిలో అర అంగుళం నీటితో మూడెకరాలలో బిందు సేద్యం ద్వారా సాగు చేయగలిగే డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. బిందు సేద్యం ద్వారా కొద్దిపాటి నీరు కొద్దిపాటి అవగాహనతో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని నరసరావుపేట మండలం లోని అర్వపల్లి గ్రామానికి చెందిన రైతు షేక్ సాంబశివరావు చెబుతున్నారు. గ్రామంలో రెండున్నర ఎకరాల భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు అంటే లక్షల్లో పెట్టుబడితో పాటు రైతుకు కొంత మేర అవగాహన ఉండాలి. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పెట్టుబడి లక్షల్లో ఉండటంతో ఆర్థిక వెసులు బాటు ఉన్న రైతులు మాత్రమే ఈ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో 20 ఏళ్లుగా వ్యవ సాయం చేసి ఏడాదికి 100 ఎకరాల పైగా మిర్చి సాగు చేపట్టి ఇటీవల స్వగ్రామానికి వచ్చిన షేక్ సాంబశివరావు తనకున్న కొంత వ్యవసాయ భూమిలో డ్రాగన్ సాగు చేప ట్టి లాభాలు గడిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలి చారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న రైతులు ధైర్యంగా సాగు చేపట్టవచ్చని చెబుతున్నారు.

రెండున్నర ఎకరాలకు రూ.18 లక్షల పెట్టుబడి

ఒక హెక్టార్లో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొదట రాబో యే సమయానికి రూ .18 లక్షల వరకు పెట్టుబడి కాగా నీటి కొరకు త్రవ్వించిన వ్యవసాయ బావికి, మోటా రు, బిందు సేద్యం పరికరాలకు అదనంగా మరో రూ.3 లక్షల వరకు వెచ్చించారు. డ్రాగన్ ఫ్రూట్ లో మేలు జాతి రకమైన "మురాకన్ రెడ్" అనే రకానికి చెందిన డ్రాగన్ పిలకలను కర్ణాటక, మహారాష్ట్ర లతో పాటు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం పులిపాడు వద్ద కూడా కొనుగోలు చేసినట్లు తెలిపారు.

దీర్ఘకాలిక దిగుబడులతో అధిక ఆదాయం

పంట సాగు చేపట్టినప్పటి నుండి 25 ఏళ్ళు పాటు దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుం దని నాటిన 9 నెలల నుండి పంట ఉత్పత్తి కాగా, మొదటి కోతలో 2 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా ఏడాదిలో 5 నుండి 6 నెలల పాటు వస్తుందని తెలిపారు. ఏడాదికి ఒక హెక్టారుకు 30 నుండి 40 టన్నుల వం కు దిగుబడి సాధించవచ్చని చెబు తున్నారు.

సేంద్రియ విధానంలో సాగు

సాగు చేపట్టే దుక్కిలో హెక్టారుకు 20 ట్రక్కుల గొర్రెల ఎరువు , సాగు చేపట్టాక 25 ట్రక్కుల పశువుల ఎరువు చీమలు, దోమల నివారణకు వేపనూనే పిచికారీ చేస్తున్నట్లు చేసినట్లు సాంబశివరావు తెలిపారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన డ్రాగన్ పండ్లు చెట్టు నుండి కోశాక 15 నుండి 20 రోజుల వరకు నిల్వ ఉంటుంది. ఫ్రిజ్‌లో లేదా ఏసీలలో నిల్వ చేస్తే 2 నెలలకు పైగా నిల్వ ఉంటుందని సాంబశివ రావు తెలిపారు.

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం

డ్రాగన్ సాగు చేయాలంటే చిన్న సన్నగా రైతులకు వ్యయ ప్రయాసలతో పాటు కష్టంతో కూడుకున్న పని. ఒక ఎకరా డ్రాగన్ సాగుకు రూ 9 నుండి 10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. భారీ పెట్టుబడులతో సాగుచేసిన పం టలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరం. సాగుకు అవసరమైన స్తంభాలు, పండ్ల మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందించాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలో డ్రాగన్ సాగు చేపట్టిన రైతులకు ఎకరాకు రూ .4 లక్షల వరకు రాయితీలు విడతల వారిగా అందించారు. బహుళ ప్రయోజనాల ఉన్న డ్రాగన్ సాగును ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

డ్రాగన్ ఫ్రూట్‌తో ప్రయోజనాలు

- డయాబెటిస్ నియంత్రణలో ఉపయోగపడు తుందని వైద్యులు చెబుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్లో ఉన్న సహజ యాంటీఆక్సిడెంట్లు ఫ్లేవనాయిడ్స్, ఆస్కార్బిక్ యాసిడ్, ఫినోలిక్ యాసిడ్, ఫైబర్ లు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడు తుంది.

- డ్రాగన్ ఫ్రూట్లో చిన్న నల్లటి గింజల్లో ఒమేగా-3, ఒమేగా-9 ఫ్యాటీ యాసిడ్లు గుండెను ఆరోగ్యంగా, బలంగా చేస్తుంది.

- శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయ పడుతుంది. విటమిన్-సి పుష్కలంగా ఉండి అనేక వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడుతుంది.

- చెడు కొలెస్ట్రాల్ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్ పెంచడంతో పాటు జీర్ణవ్యవస్థ ఉదర సమస్యలను దూరం చేస్తుంది.



- బహుళ ప్రయోజనాలు ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న రైతులతో పాటు వినియోగదారులకు ప్రీతికరమైన పంటగా అభివర్ణించవచ్చు.

వ్యవసాయ రంగంలో వినూత్న సాగు డ్రాగన్

షేక్ సాంబశివరావు, రైతు



ఈ ప్రాంతంలో విరివిగా సాగు చేయని కొత్త పంట వేయాలన్న అన్వేషణలో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఆసక్తి కలిగింది. పంట పెట్టుబడి వ్యయం ఎక్కువైనప్పటికీ డ్రాగన్ ఫ్రూట్ వలన ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మంచిదని నిల్వ చేసు కునేం దుకు అవకాశం ఉన్న పంట కావడంతో రూ. లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేపట్టాను. మరో 2 ఎకరాలలో సాగు చేసేందుకు భూమిని సిద్ధం చేస్తున్నాను. ప్రస్తుతం సాగు చేసిన తోటలోని పిలకలు కత్తిరించి సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాను. అవసరమైన రైతులకు పిలకలు తక్కువ ధరకు విక్రయిస్తాను. సాగుకు సంబంధించి మరిన్ని వివరాలు కావల్సిన రైతులు 9591793949 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

వినుకొండ యార్డు కమిటి నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-వినుకొండ



వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక యార్డులో శనివారం జరిగింది. చైర్మన్ గా బి.వెంకటేశ్వర్లు యాదవ్ (చిన్నబ్బాయి), వైస్ చైర్మన్‌గా కె.రామారావు, డైరెక్టర్లుగా ఎం.వెంకట సుబ్బారావు,ఆర్. చిన్న పుల్లారెడ్డి, ఏలూరి రాంబాబు, జి.రమేష్ బాబు, ఎం.ఆదినారాయణ, జి.హనుమంతరావు, వై.గాలెమ్మ, గుర వయ్య, ఎస్.లక్ష్మి, కె.నరసమ్మ, మొఘల్ జాహెరా, ఎ.శిరీష, మూడవత్ అరుణ బాయి, ఇ. ఆదెమ్మ లు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు మాట్లాడుతూ విను కొండ మార్కెట్ యార్డును అన్ని విధాల అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సేవలందించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. ఈ నెల 7న విజయవాడలో జరగనున్న జయహో బిసి మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

7న విజయవాడలో బిసి సదస్సును జయప్రదం చేయండి

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



ప్రజాశక్తి - పిడుగురాళ్ల : బీసీల అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్య పాత్ర పోషించారని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. 7న విజయ వాడలో జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మీడి యాతో ఆయన మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో వెనుక బడిన తరగతులకు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నా రని, వారిని గుర్తించి విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా నాటి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాసు బ్రహ్మానందరెడ్డి కృషి చేశారన్నారు. బిసిల అభివృద్ధికి కెఎస్ అనంతరామన్ కమిషన్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. తదనంతరం కమిషన్ నివేదిక ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలలో 10 సంవత్సరాల పాటు 25 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మా నందరెడ్డి జీవో నెంబర్ 1793 విడుదల చేశారని తెలి పారు. అనంతరం 1982 జనవరి 22వ తేదీన మురళీ ధర్‌రావు ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి బీసీ ల అభివృద్ధిలో జరిగినటువంటి మార్పులపై నివేదికలు విచారణ చేపట్టి, మైనార్టీలను బిసిల్లో చేరుస్తూ 29 శాతం రిజర్వేషన్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిం దన్నారు. నాటి కమిషన్లను ఆధారం చేసుకొని స్థానిక సంస్థలలో 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు బీసీలకు కల్పిం చటం వలన నేడు ఎంతో మంది బీసీలు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక ఉన్నతమైన పదవుల్లో ఉన్నారు. దీనం తటికి నాడు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కృషి ప్రధాన కారణ మన్నారు. 2019లో తాను అధికారంలోకి వచ్చిన నాటి నుండి గురజాల అభివృద్ధికి కృషి చేశానన్నారు. బిసి లకు అత్యున్నతమైన పదవులు కేటాయించామన్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర వడ్డెర కార్పొ రేషన్ ఛైర్మన్‌గా దేవళ్ల రేవతి, రాష్ట్ర కార్పొరేషన్ డైరె క్టర్లుగా ముగ్గురు, మార్కెట్ యార్డు ఛైర్మన్‌లుగా ఇద్దరు, జెడ్పిటీసీలు ఇద్దరు, ఎంపీటీసీలు 7, సర్పంచ్‌లు 18 మంది, కౌన్సిల్ సభ్యులు 11 మంది, పీఏసీఎస్ అధ్యక్షులు ఒకరు, అంతేకాకుండా బీసీలలో నాలుగు శాతం భాగమై నటువంటి మైనార్టీలకు 30కి పైగా అత్యున్నతమైన పద వులు అందించి వారి అభివృద్ధి యనలేని కృషి చేశా మన్నారు.


సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి


సదస్సులో పాల్గొన్న మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీదేవి


పంట భూములను పరిశీలిస్తున్న విద్యార్థులు

రైతే తొలి శాస్త్రవేత్త : మంత్రి కాకాని

లాంలో అగ్రిటెక్ ప్రదర్శన, సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-తాడికొండ

రైతే మొదటి శాస్త్రవేత్త అని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం లాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రిటెక్ అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలపై ప్రదర్శనను మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు తెలియజేయడంతో ఉత్పత్తి వ్యయం తగ్గించే అంశాలపై రైతులతో చర్చించాలని కోరారు. రైతుల అవసరాలు , స్థితిగతులకు అనుకూలమైన రకాలు సాంకేతికత అందుబాటులోకి రావాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సేవలను సమిష్టిగా యంత్ర పరికరాలను రైతులు ఉపయోగించుకోవాలని అన్నారు ఎన్జీరంగా విశ్వవిద్యాలయం రానున్న రోజుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. వ్యవసాయరంగంలో అమలు చేస్తున్న విప్లవాత్మకమైన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. భూసారాన్ని పరిరక్షించేందుకు ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహిస్తామన్నారు. రైతులు పంటమార్పిడి విధానం పాటించాలన్నారు. వ్యవసాయంలో రైతుకు మించిన శాస్త్రవేత్తలు ఉండరని, నిరంతరం పొలాలలో పనిచేసే రైతులకు అన్ని పరిస్థితులపై అవగాహన ఉంటుందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతన్న మూడు రోజుల సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు, పారిశ్రామిక వేత్తలు అతి తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తులు సాధించేందుకు సాగు చేయాల్సిన పంటలు, నూతన యాజమాన్య పద్ధతులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన యంత్రపరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉప కులపతి డా.ఎ.విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది డిసెంబరు 3వ తేది నుంచి 5వ తేదీ వరకు అగ్రి టెక్ ప్రదర్శనలు, సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులు జరిగే అగ్రిటెక్ 2022లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన మేలు రకమైన విత్తనాలతో పాటు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, వివిధ కంపెనీల పురుగు మందులు, అత్యాధునిక వ్యవసాయ యంత్రపరికరాలు ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. పంటల సాగులో ఎరువులు, పురుగుమందుల పిచికారికి తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని వినియోగించటానికి


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

అవసరమైన శిక్షణ అందించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయంకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం పది రకాల పంటలకు డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగుమందుల పిచికారి చేసే విధానం శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు.తాడికొండ శాసన సభ్యులు డా. ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ ఆర్‌బికేల ద్వారా పంటల సాగుకు అవసరమైన మేలు రకమైన విత్తనాలు, ఎరువులను రైతు ఇంటి ముంగిటకే అందిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధితోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం అవుతుందని, రైతుభరోసా ద్వారా పెట్టుబడికి ఆర్థిక సాయం, బ్యాంకుల ద్వారా వడ్డీ లేకుండా రుణాలు, సాగుకు అవసరమైన అత్యాధునిక వ్యవసాయ యంత్రపరికరాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం రైతుకు పూర్తిగా సహకారం అందించి అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ సలహాదారులు (వ్యవసాయం,మార్కెటింగ్) బత్తుల బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం విభాగాల డైరక్టర్లు ఎల్.ప్రశాంతి,దినేష్‌బాబు,పి.రాంబాబు రిజిస్ట్రార్ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు నంబూరులో కోటిరెడ్డి సంస్మరణ సభ

ప్రజాశక్తి - మంగళగిరి


జొన్నల కోటి రెడ్డి (ఫైల్)

సిపిఎం సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు జొన్నల కోటిరెడ్డి సంస్మరణ సభ సోమవారం ఉదయం 10 గంటలకు నంబూరు గ్రామంలోని నన్నపనేని ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని సిపిఎం పెదకాకాని మండల కార్యదర్శి ఎన్ శివాజీ శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సభలో సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి మధు, గుంటూరు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, సిపిఎం గుంటూరు మాజీ జిల్లా కార్యదర్శి ఈదా మాధవరెడ్డి, మంగళగిరి నియోజకవర్గంలోని సిపిఎం సీనియర్ నాయకులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో సిపిఎం సభ్యులు సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

13న ఆటోడ్రైవర్ యూనియన్ జిల్లా మహాసభ


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా 3వ మహాసభ ఈనెల 13న మంగళగిరి సిఐటియు కార్యాలయంలో జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ తెలిపారు. మంగళగిరి ప్రాంత ఆటో డ్రైవర్ యూనియన్ విస్తత సమావేశం సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్ అధ్యక్షతన శనివారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో జరిగింది. శివాజీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక, నిరుద్యోగులైన అనేకమంది వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయి ఆటో రంగాన్ని జీవనోపాధిగా చేసుకొని జీవిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెట్రోల్ డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడం వలన వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకి పెరిగిపోవడం వలన బ్రతకడం కష్టంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ ఎస్ చేంగయ్య, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఏడు కొండలు, షేక్ తాల్, విజయ్, షేక్ కరిముల్లా, జగపతిబాబు, ప్రసాదు పాల్గొన్నారు.

మితంగా మాట్లాడితే స్వరపేటిక పదిలం

ప్రజాశక్తి తెనాలి: గొంతుకు విశ్రాంతి అవసరమని, సాధ్యమైనంత మితంగా మాట్లాడితే స్వర పేటిక పదిలంగా ఉంటుందని స్పీచ్ తెరపిస్ట్ ఆర్ మోహన్ కుమార్ చెప్పారు. పట్టణానికి చెందిన 'అడగండి చెప్తాం' సామాజిక వేదిక ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని రత్న ఫార్ట్యూన్ కల్యాణ మండపంలో శనివారం 'మాటకు ..మౌనానికి మధ్యలో' అనే అంశంపై చర్చ జరిగింది. సినీ దర్శకులు, కార్యక్రమ నిర్వాహకులు దిలీప్ రాజా సంధానకర్తగా వ్యవహరించారు. పిల్లల్లో నత్తి ,వయసు పెరిగినా మాటలు రాకపోవడం, కీచు గొంతు తదితర సమస్యలపై స్పీచ్ తెరపిస్ట్ మాట్లాడుతూ పెద్దగా అరిచి మాట్లాడితే గొంతులో వుండే కండరాలు దెబ్బతిని వోకల్ కార్డ్స్ బలహీనపడే ప్రమాదం ఉందన్నారు. 13 ఏళ్ల వరకు అందరి స్వరం ఒకేలా వుంటుందని, ఆ తర్వాత స్త్రీ పురుషులకు స్వరం మామూలుగానే వస్తాయన్నారు. మాటలు,వినికిడి లోపాల పునరావాస కేంద్ర అధినేత ప్రముఖ మానసిక నిపుణులు కె. రమణ మాట్లాడుతూ నత్తి అనేది కేవలం ఒక భయం నుండి పుట్టుకొచ్చింది మాత్రమేనన్నారు.నత్తి వున్నవాళ్ళు పాటలు పాడుతుంటే నత్తి రాదని తెలిపారు. దీనిని కూడా స్పీచ్ తెరపి ద్వారా నయం చేయవచ్చునన్నారు. స్పీచ్


మాట్లాడుతున్న యమునా కుమారి

థెరపిస్ట్ యమునా కుమారి మాట్లాడుతూ అమ్మే ఆది గురువు అన్నారు. మాటలు రాని బిడ్డలకు అమ్మే మాటలను ఒకటికి పదిసార్లు చెప్పి నేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా మాటలు రాని అయిదేళ్ల బాలుడు దర్మ తేజను తల్లి రమాదేవి చర్చా వేదిక వద్దకు తీసుకుని రాగా, ఆ బాలుడితో మాట్లాడించే ప్రయత్నం చేశారు .ఆ బాలుడికి చికిత్సను ఉచితంగా చేస్తామని రెబ్బా మోహన్ కుమార్ తెలిపారు. మున్నంగి భాను ప్రసాద్, అక్కల రమాదేవి, న్యాయవాది గాదెలవర్రు ప్రభాకర్, మిలటరీ ప్రసాద్, యాక్స్ టైలర్స్ భాషా, మన్నే సత్యన్నారాయణ వివిధ ప్రశ్నలు సంధించారు.సమావేశంలో రమణయ్య, సిద్దెల మనోహర్, చినరాయుడు పాల్గొన్నారు

8న కెఎల్‌యులో వెబినార్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్:కెఎల్‌యులో ఈ నెల 8న నిర్మాణ శైలిపైన అధునాతన టెక్నాలజీతో పాటు నివాస సముదాయాలలో చోటు చేసుకున్న మార్పులు, నూతన ప్రాదేశిక అవసరాల కోసం స్వీకరిస్తున్న నూతన విధానాలపైన వెబినార్‌ను నిర్వహిస్తున్నట్లు కెఎల్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.బి.సెల్వరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వెబినార్‌కు ప్రముఖ ఆర్కిటెక్చర్ డాక్టర్ ఎఆర్. చేతన్ శివప్రసాద్ పాల్గొని ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రానున్న తరాల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలలో ప్రవేశపెట్టిన అనేక మార్పు చేర్పులపై చర్చించడానికి ఈ వెబినార్ ఒక వేదిక కానుందని వారు తెలిపారు. సాయంత్రం 3 గంటల నుండి 4:30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వారందరూ ముందుగా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తమ పేరును నమోదు చేసుకుని వెబినార్‌లో పాల్గొనవచ్చునని తెలిపారు. నమోదు కోసం https://forms.gle/UoJZVn7B7Tj24rug లింకుతో ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి పార్థ సారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, విభాగ డీన్ డా.ఎ.ప్రియ, అసిస్టెంటు ప్రొఫెసర్ ఆచార్య సెంతిల్ కుమార్ పాల్గొన్నారు.


దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా కార్యకర్తలు

మహిళలకు రక్షణ లేదు : ఐద్వా

ప్రజాశక్తి -దుగ్గిరాల

బయటకు వెళ్తే తిరిగి ఇంటికి వచ్చేంతవరకు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా మండల కార్యదర్శి స్వర్ణాల అరుణ అన్నారు. దుగ్గిరాలలో శనివారం మహిళల రక్షణ కోరుతూ మండల ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అత్యాచారాల బారిన పడుతున్నారని, నిర్భయ చట్టం, దిశా యాప్ల యాప్‌లు ఉన్నాయి కానీ మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నాయని విమర్శించారు. స్వేచ్ఛగా బయటకు వెళ్లి తిరిగి వచ్చే రోజులు రావాలని అన్నారు. వివిధ వృత్తుల్లో ఉన్నవారు ఆయా కార్యాలయాలలో కర్మాగారాలలో హింస బారిన పడుతూ ఉన్నారన్నారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇంతవరకు చేయలేదన్నారు. ప్రముఖ న్యాయవాది వై స్టాలిన్ మహిళల ర్యాలీకి సంఘీభావం తెలిపి మాట్లాడారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారికి అనుకూలంగా బిజెపి ఆర్ఎస్ఎస్ వారు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ర్యాగింగ్ చట్టాలు ప్రతిష్టంగా ఉన్నప్పటికీ సమానత్వం మరిచి కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. సమానత్వం కావాలని వేదికపై చేస్తున్న ఉపన్యాసాలు ఉపన్యాసాలు గానే ఉన్నాయని, అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఐద్వా అధ్యక్షులు స్వర్ణ గౌరీ, జయలక్ష్మి ,తనుజ గౌరీ ,నాగేంద్రమ్మ ,షేక్ జాహిద ,విద్యార్థినులు, శ్రావణి, స్రవంతి, శివ నాగేశ్వరి పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న విశ్వవిద్యాలయ అధ్యాపకులు,తదితరులు

మహిళల పట్ల వివక్ష తగదు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

సమాజంలో మహిళల పై జరుగుతున్న దాడులు సరికాదని జాతీయ రీసోర్స్ పర్సన్ జెండర్ పి.ఎ.దేవి అన్నారు. శనివారం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కెఎల్. విశ్వవిద్యాలయంలో జరిగిన లింగ వివక్ష వ్యతిరేక సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ బౌతిక దాడులు నియంత్రించలేకపోవడం బాదాకరమన్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్తు అందకారంగా మారుతుందని ఆంధోళన వ్యక్తం చేశారు. బాలుర విద్యతో బాలికల చదువుకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఆడపిల్ల జననం లేని చోట మానవుని మనుగడ కష్టతరమవుతుందని అన్నారు. బాలికలకు బాల్య వివాహాలను నియంత్రించాలని, ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అమలు జరుగుతన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల గృహ హింస లేదా పని ప్రదేశాల్లోవేదింపులకు గురి చేసినట్లు రుజువైతే కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అనంతరం కెఎల్‌యు అద్యాపకులు పి.ఎ.దేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి పార్థ సారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్. సిహెచ్.హనుమంతరావు, సలహాదారు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ హబీబుల్లాఖాన్ ,అసోసియేట్ డీన్ రూతు రమ్య డాక్టర్ వి.దేవి పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ తనిఖీ

ప్రజాశక్తి-రొంపిచర్ల



కార్డు దారులకు షెడ్యూల్ ప్రకారం రేషన్ పంపిణీ చేయాలని ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి అన్నారు. మం డల కేంద్రమైన రొంపిచర్లలో ఎండియు నెం. 5 వద్ద రేషన్ వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ సరుకులు పంపిణీని శనివారం ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకులను సక్రమంగా పం పిణీ చేయాలని ఆదేశించారు. అవకవతలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రేషన్ కార్డు దారులు తీసుకున్న రేషన్ సరుకులను అమ్ము కోవడం, ఇతరవాటికి వినియోగించటం చట్టారీత్యా నేరమని అన్నారు. ఆ విధంగా ఎవరైనా చేసినట్లు తమ దష్టికి వస్తే కఠినచర్యలు తీసు కోవాల్సివస్తుందని హెచ్చరించారు. తహ శీల్దార్ జె.శ్రీనివాస రావు,ఆర్.ఐ సుబ్బా రావు, విఆర్ఓ పడాల సుబ్బారెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు

మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం ఉండాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠ శాలలో చిలకలూరిపేట మండల విద్యా శాఖాధికారి కె.లక్ష్మి శనివారం సందర్శించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సం దర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం ఉండే బాధ్యత ఏజెన్సీ చూసు కోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, భోజనం చేసిన వారి సంఖ్య గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చింతపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కారెంపూడి



మండలంలోని చింత పల్లిలో కామాక్షి కంటి కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్సై రామాంజ నేయులు శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్య లతో ఉన్న వారు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు.

గ్రామ వార్డు సచి వాలయ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



స్థానిక జంపని కళ్యాణ మండపంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు పాల్గొని మాట్లాడుతూ సచి వాలయ ఉద్యోగుల ప్రొబిషనరి సమయంలో సమస్యలపై ముందుండి పని చేశా మన్నారు. మరో ముఖ్యఅతిథి రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ బిఆర్ఆర్ కిషోర్ మాట్లాడారు. అనంతరం చిలకలూరిపేట మండలంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల కొత్త కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ గ్రామ వార్డు సచివాలయం అసోసియేషన్ అధ్యక్షులుగా కె.ప్రతాప్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా సిహెచ్ కృష్ణ, మహిళా శాఖ అధ్యక్షురాలుగా ఎస్.సునీత, ఉపాధ్యక్షులుగా జోసెఫ్, అన్సర్, మీడియా కోఆర్డినేటర్‌గా ఎం.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సాగర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరిగా కె.సురేష్, ట్రెజరర్‌గా వి.సువర్ణలత ఏకగ్రీవమైనట్లు తెలిపారు.

లక్ష్యాలకు చేరువైతే ఉన్నతస్థానాలు

'ఏ డే విత్ కలెక్టర్'లో విద్యార్థులతో శివశంకర్ లోతేటి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులు ఉన్నత స్థానాల్లో రాణించాలంటే పెటు ్టకున్న లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపు నిచ్చారు. పల్నాడు కలెక్టరేట్ ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం సాయంత్రం జరిగిన 'ఏ డే విత్ కలెక్టర్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థుల్లో ఉత్సాహం కలిగించారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పటి నుంచే సమాజంపై అవగాహన పెంచుకోవాలని, తల్లి దండ్రులను గౌరవిస్తూ ఉన్నతంగా రాణించాలని సూచిం చారు. ప్రతిఒక్కకూ గొప్పగా ఎదిగే లక్ష్యాలను పెట్టుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లో యువత నైపు ణ్యం కలిగి ఉం డాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న అభి రుచులు, ఇష్టాలను అడిగి తెలుసు కున్నారు. తెలుగు, ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని విద్యార్థులకు చెప్పారు. మంచి అలవాట్లు అల వరచు కోవాలని, మహనీయుల చరిత్ర, ప్రముఖుల జీవన విధా నం నిరంతరం తెలుసుకుంటూనే, జనరల్ నాలెడ్జ్ పట్ల పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని,లక్ష్యాలను చేరు కోవాలని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు గొప్పగా ఎదిగి జిల్లాకు, వారు చదువుతున్న పాఠశాలకు, పుట్టిన ఊరికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వినుకొండ, శావల్యాపురం, ఈపూరు, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల ప్రభుత్వ గురుకుల, ఉన్నత పాఠశాలలు, వసతి గృహాలు, గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రైల్వే డివిజన్ విద్యుద్దీకరణ

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మేనేజర్

ప్రజాశక్తి-వినుకొండ



గుంటూరు రైల్వే డివిజన్ మొత్తం పూర్తి స్థాయిలో విద్యుదీకరణ చేసి కరెంట్ రైళ్ళ రాకపోకలు త్వరలో పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మేనేజర్ మంగళగిరి రామకృష్ణ అన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగా శావల్యాపురం రైల్వేస్టేషన్‌ను డీఆర్ఎం శనివారం పరిశీలించారు. రైల్వేస్టేషన్ స్థితిగతులను, పరిసరాలు, సిగ్నల్ వ్యవస్థ, టికెట్లు అమ్మకం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో డీఆర్ఎం మాట్లాడుతూ గుంటూరు నుండి నంద్యాల వరకు జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయితే ఎక్కువ స్టేషన్లలో రైళ్ళు ఆగేలా చర్యలు చేపడతామని తెలిపారు. గుంటూరు నుండి నంద్యాల వరకు 260 కిలోమీటర్లకు గాను సుమారు 100 కిమీలలో రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయ్యాయని, రైల్వే కమిషనర్ సందర్శించిన అనంతరం ఆయన ఆదేశాల మేరకు రైళ్ళ రాకపోకలు ప్రారంభిస్తామని తెలిపారు. శావల్యాపురం నుండి కారుమంచి వెళ్ళే మార్గంలో 268 రైల్వేగేటు వద్ద ఆర్యూబీ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేసి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పనులను ప్రారంభించలేదని, శావల్యాపురం స్టేషన్‌లో రెండు రైళ్ళు మాత్రమే ఆగుతుండడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని విలేకర్లు డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఆర్యూబీ నిర్మాణం ప్రారంభించేలా చర్యలు చేపడుతామని, రైళ్ళు నిలుపుదల చేయాలంటే ఎక్కువ ఖర్చుతో కూడి ఉందని, రైల్వేశాఖ నిబంధనల ప్రకారం రైల్వేస్టేషన్లో 150టికెట్లు అమ్మకం జరిగితేనే స్టాపింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు సీనియర్ డీవోఎం బాస్కర్ రెడ్డి, సీనియర్ డీఈఈ టీఆర్డీ రవితేజ, టి ఏ ప్లానింగ్ ఉమామహేశ్వరరావు, నరసరావుపేట రావు రైల్వే సిఐ తిరుపతిరావు, ఎస్సై సుభాని, స్టేషన్ మాష్టర్ ఉన్నారు.



ఎన్టీఆర్,ఘంటసాల జయంతి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-వినుకొండ

కళాసాగరి ట్రస్ట్,రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సం యుక్త ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఎన్టీఆర్,ఘంటసాల జయంతి ఉత్సవాలు జాషువా కళాప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. తెలుగు రాష్ట్రాల నుండి కళాకారులు భారీగా విచ్చేసి పాటలు తదితర పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఎన్‌వికె సుజాత, వ్యవహరించారు. సాయంత్రం జరిగిన సభా కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవా పురస్కారాన్ని అసిస్ట్ ఇండియా డైరెక్టర్ రంగారావుకు ఎన్టీఆర్ రంగస్థలం పుర స్కారాన్ని సుప్ర సిద్ధ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ,కు అందజేశారు. ఘంటసాల పురస్కారాన్ని నల్గొండకు చెందిన బుద్ధ శ్రీనివాస్‌కు అందజేశారు. అనారోగ్య కారణం గా సినీ నటుడు గిరిబాబు హాజరు కాలేదు. ఈ కార్యక్రమంలో మొత్తం 100 మంది కళాకారులను సత్కరించారు. పాటల పోటీలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-రొంపిచర్ల : మండలంలో కొనకంచివారిపాలెంలోని పోలింగ్ కేం ద్రాలను నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామంలోని 39,40 నంబర్ల గల పోలింగ్ స్టేషన్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఓటర్ కార్డు లకు ఆధార్ నెంబర్ల అనుసంధాన ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంబంధించిన 6,7,8 ఫారాలు నమోదు చేసుకునే విధానాన్ని తనిఖీ చేశారు.

ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు ఇవ్వాలి

పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ. మారుతివరప్రసాద్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

టిడ్కో గహాలను మౌలిక సదుపాయాలు మెరుగు పరిచి వెంటనే అంద జేయాలని,జగనన్న కాలనీ ఇళ్ల నిర్మా ణానికి ఒక్కొక్క ఇంటికి రూ. 5 లక్షలు ఇవ్వాలని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్ శనివారం డిమాండ్ చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గ సమితి ఆధ్వ ర్యంలో పట్టణ పరిధిలోని 57 ఎకరాలలో నిర్మించిన టిడ్కో గృహాలను వం ్రప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ మూడేళ్ల కాలంగా వెసిపి ప్రభుత్వానికి టిడిపిపై ఉన్న కోపాన్ని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై చూపిస్తోందని విమ ర్శించారు. లబ్దిదారులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే లక్ష ఎనభై వేలు సరిపోక జగనన్న కాలనీలన్నీ నిర్మాణానికి నోచుకోకపోవడంతో లబ్ధి దారులు అల్లాడుతున్నారన్నారు. ఇల్లు నిర్మించుకోలేక అధి కారుల వేధింపులు తట్టుకోలేక బాధపడుతున్న పేదలకు సిపిఐ వెన్నుదన్నుగా నిలిచి పోరా టానికి సిద్ధమైందని అన్నారు. ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న మున్సి పల్ కార్యాలయాల వద్ద, మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్య్ర కమాలు నిర్వహిస్తామని, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తా మని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, ఎపి రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఎఐటియుసి ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, ఎపి మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు బొంతా భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దీనమ్మ ఆశ్రమాన్ని సందర్శించిన శిశు సంక్షేమ శాఖాధికారిణి

ప్రజాశక్తి- రాజుపాలెం

మండలంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న ఆశ్రమాన్ని శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ. అరుణ శని వారం సందర్శించారు. ఆశ్రమంలో మౌలిక వసతులు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సొసైటీ నిర్వహిస్తున్న ఆశ్రమం వాతా వరణం చాలా ఆహ్లాదకరంగా ఉందని, విద్యా ర్థులకు క్రమ శిక్షణ, భవిష్యత్తు ప్రణాళిక గురించి సూచ నలు చేశారు.ఆమెతోపాటు జిల్లా ప్రొడక్షన్ ఆఫీసర్ బి .విజయకుమార్, చైల్డ్ హెల్ఫేర్ కమిటీ లీగల్ అడ్వకేట్ బి.వాసంతి, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సమీర్ తదితరులు ఉన్నారు.



'ఉపాధి' పనులు చేయకపోయినా చెల్లింపు

సర్వసభ్యసమావేశంలో కోఆప్షన్ సభ్యులు విమర్శ

ప్రజాశక్తి-ఈపూరు

ఉపాధి హామీ పనులు చేయని వారికి చేసిన వారితో సమా నంగా కూలి డబ్బులు చెల్లిస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్లు వారి ఇష్టా నుసారం ఉపాధి హామీ పను లలో అవకతవకలకు పాల్పడు తున్నట్లు మండల పరి షత్ కోఆప్షన్ సభ్యులు షేక్ సైదా ఆరోపించారు. శని వారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో పాల్గొన్న షేక్ సైదా మాట్లాడుతూగ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై అధికారుల పర్యవేక్షణ శూన్యమని అధికారుల సహకారంతోనే అవి నీతికి పాల్పడుతున్నారన్నారు. గ్రామ సభలకు స్థానిక ప్రజాప్రతినిధులను పిలవడం లేదంటూ మండిపడ్డారు. గ్రామాలలో విద్యుత్ తీగల కిందకు వేలాడుతున్నాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారి షేక్ రఫీని కోరారు. విద్యార్థులు పాఠశాలకు, ఇంటికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం తో ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపిపి గోలి భాగ్యలక్ష్మి వినుకొండ డిపో అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడం పట్ల ఎంపిడిఒ ఎ.ఉషా కిరణ్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య, వైసిపి మండల కన్వీనర్ కోపెల దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గత మూడు నెలలుగా కుట్టు శిక్షణలో మెళకువలు నేర్చుకుని కోర్సు పూర్తి చేసిన మహిళలకు శనివారం ప్రజా ప్రగతి ట్రస్ట్ సంస్థ సర్టిఫికెట్లను అందజేసింది. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థాన్, ప్రజాప్రగతి ట్రస్ట్ సంయుక్తంగా మహిళలకు ఉపయోగపడే ఉపాధి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా తమవంతు సహాయం అందజేయడానికి మహిళలకు ఉపయోగపడుతుందని వివరించారు. ఉచిత శిక్షణ మాత్రమే కాకుండా భవిష్యత్తులో కుట్టు మిషన్లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహానాడు ప్రాంతంలో గ్రూపుల వారీగా శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు మేనేజర్ మురళీజ్యోతి, అసిస్టెంగ్ ప్రోగ్రాం ఆఫీసర్ సాయిరాం, ట్రస్టు చైర్మన్ ఎం.శ్రీనివాసులు, మహిళా పోలీస్ కిరణ్మయి, సమన్వయ కర్తలు మాధవరావు, చంద్రశేఖర్, సుస్మిత, సువర్ణ, భ్రమరాంబ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అందే బాలచంద్ర మౌళి

ఉద్యోగుల సమస్యల సాధనకు సమిష్టిగా పోరాడాలి

ప్రజాశక్తి-కొల్లిపర

ఉద్యోగులు తమ సమస్యల సాధనకు కలిసికట్టుగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు ఏ. చంద్రమౌళి అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ సంఘాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన గుంటూరు మెడికల్ కాలేజీలోని జింఖానా ఆడిటోరియంలో జరిగే రెండో కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలన్నారు. సభలో రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి. మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ బాలకృష్ణారెడి, వి.సుబ్బారావు,డి.ఆశీర్వాదమ్మ ,ఆర్.ఐ. శ్రీనివాసరావులు పాల్గొన్నారు

విద్యుత్ మీటరుకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -మంగళగిరి

నగరంలో టిడ్కో గృహం మంజూరైన లబ్ది దారులు విద్యుత్ మీటరుకు తమ పేరిట నమోదు చేసుకోవాలని శనివారం నగర పాలక సంస్థ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.ఇందు కోసం జగనన్న కాలనీ టిడ్కోగృహ సముదాయంలోని ఏ 14 బ్లాక్ వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. లబ్ది దారులు తమ ఆధార్ కార్డు,షేల్ డిడ్, డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో, రూ.450 నగదు తీసుకొని సదరు క్యాంపుకు హాజరు కావాలన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : సిఐటియు



సభలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి పట్టణంలోని ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. మహాసభకు వి.సతీష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ పట్టణం మొత్తాన్ని శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలల పెండింగ్ హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. గత ఆరు నెలల నుండి సబ్బులు, కొబ్బరినూనె, చేతులకు రక్షణ పరికరాలు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేయాల్సి వస్తుందని చెప్పారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్మికులపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ అధ్యక్షులుగా వనమా సతీష్, కార్యదర్శిగా కె.వెంగమ్మ, గౌరవాధ్యక్షులుగా బూరుగ వెంకటేశ్వర్లుతో పాటు మరో 15 మందితోనూతన కమిటీ ఎన్నికైంది.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

రజక కమ్యూనిటీ హాలు పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరులో నిర్మాణం అవుతున్న రజక కమ్యూని హాలు నిర్మాణ పనులను శనివారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. రజక కమ్యూనిటీ చెందిన ఈ స్థలంలో చాకలి ఐలమ్మ రజక సంక్షేమ సంఘం సొసైటీ పేరుతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యేకు గతంలో వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి చివరి నాటికి పూర్తిస్థాయిలో కమ్యూనిటీ హాలు వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట పట్టణ వైసిపి నాయకులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, ఇ.డేవిడ్‌రాజు, నాగమల్లేశ్వరరావు, రజకవృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.భాస్కరయ్య, నాయకులు వి.వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వారం రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ పనులను స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డిఇ కృష్ణారెడ్డి, డేవిడ్‌రాజు, గంజి చిరంజీవి, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-తాడేపల్లి: సీతానగరంలో బోర్డు యార్డు, చర్చి తదితర ప్రాంతాల్లో మూడు అంతర్గత రోడ్లను ఏర్పాటు చేశారు. గతంలో ఈ రోడ్లు నడవడానికి వీల్లేకుండా ఉన్నాయి. ఇటీవల ఆ ప్రాంతంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటించారు. స్థానికులు ఆయన



దృష్టికి అంతర్గత రోడ్ల ఇబ్బందులను తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన రెండు రోజుల్లోనే అంతర్గత రోడ్లను బాగు చేయించారు. దీంతో స్థానికులు లోకేష్‌కు అభినందనలు తెలిపారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

చంద్రకళ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరానికి ఎంసీఏ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. సీనియర్స్, జూనియర్స్ సమిష్టి సహకారంతో ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో హంగామా చేశారు. సరదా సరదాగా గడిపారు. ఒకరినొకరు పరిచయం చేసుకోవటం, అభిరుచులు పరస్పరం తెలుసుకోవడం వంటి కృత్యాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జి విజయ్ కృష్ణ పర్యవేక్షించగా కార్యక్రమంలో నరేష్ , శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

అందుబాటులో లేని బిఎల్‌ఓలకు తాఖీదులు జారీ

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఓటరు నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ రాంప్రసాద్ అన్నారు. శనివారం నూతక్కిలోని జడ్పీ స్కూల్లో ఏర్పాటైన క్యాంపును మంగళగిరి తహశీల్దార్ జి.వి రాంప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిఎల్ఓ విధులకు రావాల్సిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రియాంక, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీత, పంచాయతీ సెక్రెటరీ సత్యనారాయణలు అందుబాటులో లేకపోవడంతో తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి తాఖీదులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. తక్షణమే విధులకు రాకపోతే సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తానని హెచ్చరించారు. పెదవడ్లపూడి యూపీ స్కూల్‌లో బిఎల్ఓలకు తహశీల్దార్ రాంప్రసాద్ పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ వద్ద నెంబర్లు వేయించాలని అన్నారు. ప్రతి ప్రాంతంలో మైక్ ద్వారా ఓటర్ నమోదు క్యాంపులపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ క్యాంపుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పు అని హెచ్చరించారు.

విఆర్ఏ మృతికి తహశీల్దార్ సంతాపం

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నూతక్కి గ్రామ వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న దాసరి యలమంద (54) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంగళగిరి తహశీల్దార్ జివి రాంప్రసాద్ శనివారం నూతక్కిలోని నివాసం వద్దకు చేరుకుని యలమంద భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రభుత్వం నుండి రూ.5 వేలు మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ బాల నాగేశ్వరరావు, విఆర్ఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విఆర్ఏ యలమంద భౌతికాయానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

మానవ హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెంటర్ ఫర్ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ నందు గోడపత్రికను శనివారం హెూం మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. ప్రపంచ మానవ హక్కుల ప్రకటన 75 ఏళ్ల పురస్కరించుకొని జరగనున్న వారోత్సవాల సందర్భంగా ఈనెల 3 నుండి 10 వరకు ఐక్యరాజ్యసమితి ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సమన్వయ అధికారి సరస్వతి రాజ్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఫర్ ప్రొటెక్షన్ సభ్యులు అబ్దుల్ మునాబ్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మలబార్ మైన్ డైమండ్ షో ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో మైన్ డైమండ్ షోను ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ సతీమణి మాద్దాలి పూర్ణిమ శనివారం ప్రారంభించారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ లో మహిళలకు ఇష్టమైన మంచి మోడల్స్ ఉంటాయని కస్టమర్లు ఎక్కువ ఈ షోరూమ్‌లో ఉన్న మోడల్స్‌ను ఇష్టపడతారని అన్నారు. డిజైన్ క్వాలిటీ డైమండ్స్ అందమైన మోడల్స్ లభిస్తాయని అన్నారు. ఈ మైన్ షోను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మలబార్ షోరూం హెడ్ నదీర్ మాట్లాడుతూ ఈ డైమండ్ షో డిసెంబర్ 3 నుండి 7వ తారీకు వరకు కొనసాగుతుందని తెలిపారు. వాసవి వనిత క్లబ్ నాయకులు మట్టుపల్లి సునీత, అనురాధ, మోడల్ కుసుమ, స్టోర్ మేనేజర్ వరప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ పాల్గొన్నారు.



రామ్మోహన్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

ఎన్‌టిఆర్ వ్యక్తిత్వం ఎంతో గొప్పది

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాలపై సమీక్ష శనివారం స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హోమ్‌లో నిర్వహించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకూ ప్రదర్శించిన ఎన్‌టిఆర్ చిత్రాలు, వాటికి ప్రేక్షకుల నుంచి లభించిన స్పందన, ఆయన నటనా శైలి, రాజకీయాల్లో ఎన్‌టిఆర్ మార్క్‌పై సమీక్ష జరిపారు. అలాగే 'ఎన్‌టిఆర్ -కథానాయికలు' అంశంపై కె.విజయమోహనరావు, ఫణిదెపు దుర్గాప్రసాద్ ప్రసంగించారు. కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా సీనియర్ కళాకారుడు కె.రామ్మోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎ.వెంకటేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, గిరి గణేష్, డి.భవాని, ఎం.రాఘవరావు, యు.ధర్మారావు, ఎస్.మధుసూధనరావు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల శతజయంతి ఉత్సవాలు

ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు సత్తెనపల్లి పాత బస్టాండ్ లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత వజ్రగిరి జస్టిస్ సత్తెనపల్లి పట్టణ వివిధ కళారంగా సాహితీ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జస్టిస్ చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



వార్షిక పోలీసు స్టేషన్ తనిఖీలో భాగంగా తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని కొల్లిపర పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్.పి. ఆరిఫ్ హఫీజ్ శనివారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను ప్రణాళి కాబద్ధంగా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు స్థాపనలో గ్రామసచివాలయ మహిళా పోలీసులు భాగస్వాములు కావాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలిక వివాహాలపై అవగాహన కార్యక్రమాలు, వరకట్నం కేసులు, భార్య భర్తల మధ్య కుటుంబ సభ్యుల మధ్య వచ్చే తగాదాలు మొదలైన వాటిని త్వరితగతిన పరిష్కారం చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ లాకప్, కంప్యూటర్ గది, చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో వివిధ కేసులలో సీజ్ చెయ్యబడిన వాహనాల గురించి ఆరతీశారు, తదుపరి పోలీస్ సిబ్బందితో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమై వారు నిర్వహించు విధుల గురించి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సివిల్, భూతగాదాలు, వివాదాలు, ఆర్థిక వివాదాల గురించి, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు మరియు చిన్న పిల్లల పట్ల జరిగే నేరాలు మరియు ఇతర అంశాలపై క్షేత్రస్థాయిలో తెలుసుకొని ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియపరచాలని, గ్రామాల్లో శాంతిభద్రతలు స్థాపనలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలకు దిశ యాప్, సైబర్ మోసాలు, ఫేక్ లోన్ యాప్ మోసాలపై, పాఠశాలు, కళాశాలల విద్యార్థులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లుపై అవగాహన కల్పించాలని సూచించారు. గుంటూరు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రావు, తెనాలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, కొల్లిపర పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : కమిషనర్



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : పేదలందరికీ ఇళ్ళ పథకంలో లబ్ధిదారులు తమ ఇళ్ళ నిర్మాణాలు వేగంగా చేపట్టాలని, అందుకు నగరపాలక సంస్థ, హౌసింగ్ డిపార్ట్మెంట్లు సంపూర్ణ సహకారం అందిస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శనివారం బుడంపాడు 2, 3 జగనన్న లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణాల పురోగతిని నగర కమిషనర్ గృహ నిర్మాణ శాఖాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుడంపాడు 2,3 లేఅవుట్స్‌లో 427 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందని, లబ్ధిదారులు కొందరు సొంతగా ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్నారని, కొందరు కాంట్రాక్టర్‌కు అప్పగించారన్నారు. ఇంటి నిర్మాణానికి నీటి వసతి, విద్యుచ్ఛక్తి వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి, డిసెంబర్ నెల చివరి వారం నాటికి గృహ ప్రవేశాలు చేసేలా చూడాలన్నారు. లే అవుట్ కు వచ్చే ప్రధాన రహదారికి టెండర్ ప్రక్రియ పూర్తి అయిందని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వర్క్ ఆర్డర్ ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. లే అవుట్‌లో నగరపాలక సంస్థ నుండి చేపట్టాల్సిన పనుల వేగవంతంకు డి.ఈ.ఈ. స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించి, ప్రతి రోజు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. పర్యటనలో జిఎంసి ఎస్ఈ భాస్కర్, డి.ఈ.ఈ.హనీఫ్, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు, హౌసింగ్ డి.ఈ.ఈ. సత్యనారాయణ పాల్గొన్నారు.

ర్యాగింగ్, లింగ వివక్ష పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం వర్సిటీ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'ర్యాగింగ్ రహిత' 'లింగ వివక్ష' లపై అవగాహనా సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ సదస్సులో మాట్లాడుతూ ర్యాగింగ్ రహిత విశ్వవిద్యాలయముగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము కొద్ది సంవత్సరాల క్రితమే ఎన్నో బహుమతులు సాధించిందన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో తల్లి తండ్రులకూ, విశ్వవిద్యాలయముకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎఎస్‌పి టి. శోభామంజరి మాట్లాడుతూ తెలిసీ తెలియక ఏ ఒక్కరూ ర్యాగింగ్‌కి పాల్పడవద్దని సూచించారు. ర్యాగింగ్ పై అవగాహన కలిగించేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆలోచింపచేసేవిగా ఉన్నాయని విద్యార్థులను అభినందించారు. ఐపీఎస్ అధికారి రాజకుమారి మాట్లాడుతూ భారత దేశంలోనే నాగార్జున విశ్వవిద్యాలయంకు విశిష్టమైన గుర్తింపు ఉన్నదనీ ఈ విశ్వవిద్యాలయం ర్యాగింగ్ రహిత విద్యాలయంగా ఉంటూ విద్యార్థులకు ఎంతో ఉన్నత విలువలను నేర్పుతున్నదనీ పేర్కొన్నారు. రైతు భారతంగా పేరొందిన మన దేశంలో గ్రామీణ ప్రాంతాలతో సహా యువత ప్రపంచ, దేశ వ్యాప్తంగా ఉన్నత వ్యక్తులుగా ఎదిగినప్పుడే అసలైన అభివృద్ధి అనీ, విశ్వవిద్యాలయం అందుకు దోహదం చేస్తోందనీ తెలియజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బీ. కరుణ విశ్వవిద్యాలయ వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి.. హామీని నెరవేర్చాలి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి : విద్యుత్ కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. బాలకాశి

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జల్లెడ రాజశేఖర్, పి శ్రీనివాసరావు సహా 16 మందితో నూతన కమిటి ఎన్నిక

ప్రజాశక్తి - నరసరావుపేట



మాట్లాడుతున్న బాలకాశి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో నాడు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. బాలకాశి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ షేక్ జానీ భాష, ఏం బాలకష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 4 ఏళ్ళు కావస్తున్నా హామీలు అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, పదేళ్ల సర్వీస్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయ్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు తదితరులు ప్రసంగించారు.

16 మందితో నూతన కమిటి

అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా జల్లెడ రాజశేఖర్, పి శ్రీనివాసరావు



యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా నూతన కమిటీ 16 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా జల్లెడ రాజశేఖర్, పి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా ఎస్ అంజనేయులు నాయక్, కోశాధికారిగా ఎం బాలకృష్ణ, సహాయ కార్యాదర్శిగా ఎస్ జాన్ కుమార్, ఉపాధ్యక్షులుగా షేక్ బాషా, కరీముల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

18న ఎపిజిఇఎ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరులోని మెడికల్ కాలేజి, జింకానా ఆడిటోరియంలో డిసెంబర్ 18న జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా రెండో కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌భాషా పిలుపునిచ్చారు. కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను ఎపిజిఇఎ నాయకులు శనివారం స్థానిక మెడికల్ కాలేజి ప్రాంగణంలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్‌రావు, ఎస్.రామ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. దీనిలో అన్ని శాఖల ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ కలిసి 18వ తేదీన జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎల్.పద్మావతి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీసామ్రాజ్యం, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి, పెన్షన్ విభాగం ప్రధాన కార్యదర్శి సిహెచ్ మత్తయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మండల్ విగ్రహ ఏర్పాటుకు ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి-గుంటూరు : ప్రముఖ సంఘ సంస్కర్త బిపి మండల్ విగ్రహాన్ని అమరావతి రోడ్డు, చిల్లీస్ దాబా వద్ద ఏర్పాటు చేయాటానికి కౌన్సిల్‌లో ఆమోదించి నందుకు పలు బిసి సంఘాల నాయకులు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయు డుని, మేయర్ క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బి.పి మండల్ బిసిలకు రిజర్వే షన్లు కల్పించటానికి ఎంతగానో పోరాటం చేశా రన్నారు. మండల్ వంటి సంఘ సంస్కర్తల గురించి నేటి తరానికి తెలియాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిఎంసి కౌన్సిల్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మండల్ విగ్రహాన్ని త్వరితగతిన ఏర్పాటు చేస్తామని తెలియచేశారు. బి.సి సంఘాల నాయకులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, ఆలా వెంకటేశ్వరరావు, పావులూరి హనుమంతరావు, తాడికొండ నరసింహా రావు, ఉగ్గల సాంబశివరావు, అన్నవరపు నాగమల్లేశ్వ రరావు, దాసరి శివకుమార్, కుమ్మరి క్రాంతి కుమార్, గండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

7 వీక్షణం

పెరిగిన రాజకీయ కార్యకలాపాలు

సార్వత్రిక ఎన్నికలకు ఏడాదికి పైగా సమయం ఉన్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. ప్రజా సమస్యల కన్నా అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. వామపక్షాలు ఇప్పటికే పలు ప్రజా సమస్యలపై పోరాటాలను కొనసాగిస్తున్నాయి. నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమాలుచేస్తున్న సిపిఎం, అనుబంధ రైతు సంఘాలు, కౌలు రైతులు సంఘాలు వివిధ అంశాలపై పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా వివిధ దశల్లో ఆందోళన నిర్వహిస్తోంది. అలాగే జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులకు సిపిఎం అండగా నిలబడుతున్నాయి. మరో వైపు టిడిపి, వైసిపి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలని టిడిపి ప్రయత్నిస్తుండగా వివిధ వర్గాలలో మళ్లీ సానుకూలతను పెంచుకునేందుకు వైసిపి ఎత్తుగడలను వేస్తోంది. అంతేగాక పార్టీలో సంస్థాగత మార్పులపై వైసిపి అధినాయకత్వం దృష్టిసారించింది. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. వేర్వేరు జిల్లాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులను జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలుగా నియమించారు. అధికారంలో ఉన్నా ఇప్పటి వరకు తమకు ఎటువంటి ప్రయోజనాలు కల్గలేదని అసంతృప్తితో ఉన్న వివిధ తరగతుల నేతలను ఆకట్టుకునేందుకు సదస్సులు నిర్వహించాలని వైసిపి అధినాయకత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం గుంటూరులో వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సదస్సు నిర్వహించారు. తాడికొండకు అదనపు సమన్వయ కర్త బాధ్యతల నుంచి డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను తప్పించి జెడ్‌పి చైర్మన్ క్రిస్టీనా భర్త కత్తెర సురేష్ కుమార్‌ను ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని వైసిపి ఎమ్మెల్యేలు కొనసాగిస్తున్నారు. టిడిపి సంస్థాగతంగా ఇంకా పూర్తి స్థాయిలో నిర్మాణ లోపాలను సవరించుకోవడం లేదు. ప్రత్తిపాడు, సత్తెనపల్లికి పూర్తిస్థాయి ఇన్‌చార్జిలను నియమించలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు జరిగే పర్యటనలో చంద్రబాబు సంస్థాగత అంశాలపై జిల్లా నాయకులతో చర్చించనున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా టిడిపి నేతలు ఇదే ఖర్మంరా బాబు నినాదంతో పలు చోట్ల నిరసన కార్యక్రమాలకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టారు. ఇదే కార్యక్రమం నిర్వహించేందుకు చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్నారు. 8న తెనాలి, పొన్నూరు, 9న బాపట్ల, చీరాల, 10న పర్చూరు, పత్తిపాడు నియోజకవర్గంలో పర్యటిస్తారు. వైసిపి కూడా బిసిల ఓటు బ్యాంకుపై దృష్టి సారించింది. విజయవాడలో జరిగే బిసిల సదస్సుకు జిల్లా నుంచి భారీ జనసమీకరణకు వైసిపి నాయకులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటం గ్రామంలో రహదారుల విస్తరణ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల రెండు సార్లు బాధితులతో మాట్లాడారు. ఇళ్లను తొలగించిన ఘటనలో నష్టపోయిన బాధితులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున పరిహారం అందించారు.